# "చొచ్చో!" అనే సింపతీ కథ రోదన

మందడి తిలక్

లింగమూర్తిగారు పట్టు పడితే, వో పట్టాన విడిచిపెట్టే మనిషికాదు. ఊళ్ళోకల్లా లక్షాధి కారి. అలాంటివాడికి ఎలక్షన్లలో పోటీచేసి ఢిల్లీ వెళ్ళాలనే కోరిక కలగడం సహజమే! రొఖ్ఖతల్చు పంటే దెబ్బలకు కొదవా అని-కోరిక కలగడం, నామినేషన్ వేసేయడం కూడా జరిగి పోయేయి. నామినేషను వేసే ప్పుడు "ఏ గుర్తు కావాల్సార్ తమకి?" అని అడిగేరు లింగ మూర్తిగార్ని.

లింగమూర్తిగారు క్షణం ఆలోచించి గంభీరంగా చెప్పేరు "కొండముచ్చు"

"అదేం సెలక్షను సార్?" ఆశ్చర్యపోయేడు అక్కడున్న ఆఫీసరు.

"నీ మొహం చూసేక అదే గుర్తొచ్చింది మరి" లింగమూర్తి గారు జోకేరు.

రిటర్నింగు ఆఫీసరుగారు బలవంతాన నవ్వేసి, కొండముచ్చు గుర్తు శాంక్షను చేసేసి లింగ మూర్తిగార్కి బెస్టాఫ్‌లక్ చెప్పే సేరు.

ఆ రోజే లింగమూర్తిగారి దగ్గర్నుంచి కబురొచ్చింది నాకు.

"మనం ఎలక్షన్లలో నిల బడ్తున్నామోయ్. స్పీచులు వగైరా రాసిపెట్టాలిమరి" అని అడిగేరు. అంత పెద్దమనిషి అంతలా అడిగేసరికి నేను పొంగి పోయి "దానేవుంది సార్. మహద్భాగ్యం!" అంటూ వొప్పేసుకున్నాను.

ఇద్దరవూ ఆ రాత్రి కలిసి కూర్చుని "స్ట్రాటజీ" ఆలో చించడం మొదలెట్టాం!

"సింపతీ గురూ గారూ!" అన్నాన్నేను. "ఎలక్షను గెలవా లంటే జనంలో సింపతీ సంపా దించుకోవాలి! ఈ మధ్య వొచ్చిన ట్రెండు ఇది..." చెప్పాను.

సాలోచనగా తల వూపేరు లింగమూర్తిగారు.

మర్నాడు సెంటర్లో షామి యానా అధీ వేసి మూర్తిగారి బహిరంగసభ పెట్టాం. జనం బాగానే వొచ్చారు.

లింగమూర్తిగారు లాల్చీమీద దుప్పటి కప్పుకుని విషాదంగా కూర్చున్నారు. వో ఛోటా నాయ కుడు ప్రారంభోపన్యాసం చేస్తూండగా, పక్కనే నిల్చుని వున్న నా వైపు వొంగి "ఈ దుప్పటి తీసెయ్యమంటావోయ్? చంకల్లో వొకటే చెమట కార్తోంది మరి" అని చికాగ్గా అన్నారు లింగమూర్తిగారు.

నేను అదిరిపడ్డాను. "భలే వారే! ఆ పన్జేసేరు. సింపతీకాస్తా పోద్ది" కంగారుగా చెప్పాను.

కాసేపటికి లింగమూర్తిగారి వుపన్యాసం టైము వొచ్చింది. ఆయన దగ్గుకుంటూ లేచి, వంగి పోతూ మైక్ దగ్గరికి నడిచి వెళ్ళేరు. మైకు పట్టుకుని "మిత్రులారా!" అని, భోరున ఏడ్చారు.

జనంలో కరుణ వుప్పొంగి హాహాకారాలు చేసేరు.

లింగమూర్తిగారు వెక్కుతూ మాట్లాడటం మొదలెట్టారు.

"నేను ఎంత విషాదజీవినో మీకు తెల్సు. పాతికేళ్ళ వయ సులోనే స్త్రీ స్వాతంత్రం కోసం పాటుబడ్తూ జైల్లోపడి పోలీసుల చేత దెబ్బలుతిన్నాను. అప్పట్లో మా పక్కింట్లో వుండే మేస్టారి కూతుర్ని, చెయ్యిపట్టుకు దగ్గరికి లాక్కుని స్వేచ్ఛ గురించి బోధిస్తూంటే అపార్థం చేసుకుని పోలీసులు నన్ను అరెస్టుచేసి బాధలు పెట్టేరు. అంతటి త్యాగ మయి జీవితం నాది"

జనంలో "అయ్యో! చొచ్చో!!" వగైరా సానుభూతి వాక్యాలువినపడ్డాయి. "అంతేకాదు ముగ్గురు పెళ్ళాలూ వకళ్ళమ్మట వొకళ్ళు బాల్చీ తన్నేసేరు. మా ముత్తాత చచ్చిపోయాడు. మా తాత చచ్చిపోయాడు. మా అమ్మమ్మ చచ్చిపోయింది" లింగమూర్తిగారు కన్నీరు కారు స్తుంటే, జనం జేబురుమాళ్ళు నోట్లో దోపుకుని వెక్కటం మొదలెట్టారు "మొన్నటికిమొన్న నేను ప్రజాసేవకని నామినేషన్ వెయ్యడానికెళ్తే, మానాయనమ్మ ధామ్మని చచ్చింది."

లింగమూర్తిగారు కిందపడి దొర్లి ఏడుస్తూంటే, జనం అంతా వేదిక మీదకొచ్చి "ఊరుకోండి సార్" అని గాద్గదిక స్వరాల్తో వారిని వోదార్చసాగేరు.

ఇంటికొచ్చేసేక "ఎలా వుం దోయ్ మన పెర్‌ఫార్మెన్స్?" అని అడిగేరు లింగమూర్తిగారు "టెర్రిఫిక్‌గా వుందిసార్" అన్నాను నేను.

ఆ తర్వాత వో పది రోజులు పబ్లిసిటీ లాగించాం. పోటీదార్లు రక రకాల విమర్శలు చేసినా మా దగ్గర ఆయుధం సిద్ధంగా వుండేది. "లింగమూర్తి బ్లాక్ మార్కెటింగు చేస్తాట్ట కదా!" అని ఎవరైనా అడిగితే "అయితే మాత్రం. పాపం వాళ్ళ నాయ నమ్మ చచ్చిపోయిందీ మధ్యనే!" అనే వాళ్ళం. దెబ్బకి అడిగిన వాడు కాస్తా కళ్ళు తుడుచు కుంటూ వెళ్ళిపోయే వాడు. "పదేళ్ళ క్రితం వోవరు బ్రిడ్జి మీద ఖూనీచేసింది లింగమూర్తి గారే కదా?" అంటూ ఎవరైనా ఆరాతీస్తే "అదినిజమేగాని, వారి నాయనమ్మ చచ్చిపోయింది పాపం!" అని భోరుమనేవాళ్ళం వెంటనే వాడు కూడా ముక్కు చీదుకునేవాడు అన్నీ మర్చిపోయి.

ఉన్నట్టుండి వో రోజు లింగ మూర్తిగారుజబ్బుపడిహాస్పటల్లో చేరారు. "ఇదీ మన మంచికే ఇంకా సింపతీ వచ్చేస్తది!" అనినేను ధైర్యం చెప్పి రంగంలోకి ఉరికేను. క్షణాల్లో లింగమూర్తి గారు చావుబతుకుల్లో వున్నారని ఊరంతా పాకేసింది. మందలు మందలుగా జనం గొల్లున ఏడ్చుకుంటూ హాస్పిటల్ చుట్టూ చేరారు.

హాస్పిటల్ బైట నేను మైకు పట్టుకుని లింగమూర్తిగారి గురించి ఉద్వేగంగా ప్రసంగించ సాగేను. జనంలో కరుణరసం పొంగి ప్రవహిస్తోంది. దాన్తో మున్సిపాల్టీవాళ్ళూ, ఫైర్‌స్టేషన్ వాళ్ళూ వొచ్చి మోటార్లు పెట్టి ఆ కరుణ రసాన్ని డ్రయినేజి ల్లోకి లాగటానికి తీవ్ర కృషి మొదలెట్టారు.

అప్పుడు జరిగింది పొరపాటు

చాలా పెద్ద పొరపాటు.

ప్రక్కనే నిల్చుని వున్న హాస్పిటల్ డాక్టర్‌కి మైకు ఇచ్చి "లింగ మూర్తిగారి ఆరోగ్యం గురించి చెప్పండి" అన్నాను, నా వుపన్యాసం అయిపోయాక. అదే నేను చేసిన పొరపాటు ముందే డాక్టరుకి చెప్పి ఉండా ల్సిన మాట నిజమే! అయితే డాక్టరుకి ఆ మాత్రం కామన్ సెన్సు వుండదని ఎప్పుడూ అనుకోలేదు.

వాడు మైకు ముందు కొచ్చి "ఏం చెప్పమంటారు లింగ మూర్తిగారి ఆరోగ్యం గురించి" అని ముక్కు చీదేడు. భోరు మన్నారు జనం.

"శబ్బాష్" అనుకున్నాను, ముందేం జరగబోయేదీ వూహించలేక.

"ఈనాటివా? ముప్పై ఏళ్ళ నుంచీ వారికున్న రోగాలే అవి. గనేరియా!, సిఫిలిస్, ఏవన్నా కొత్తవా? అలాంటిది ఇంత వున్నట్టుండి తిరిగి పెట్టడ మంటే- విధి వైపరీత్యం కాక మరేవిటి?"

అప్పటికే డాక్టరు దవడ మీద ఫెడీమని వేశాన్నేను. కానీ ఆలస్యమైంది.

మర్నాడే లింగమూర్తిగారు నామినేషన్ వుపసంహరించు కున్నారని వేరే చెప్పాలా? *